# అద్భుత శక్తులు

కనంబ కళ్లు పరీక్ష చేయించుకోవటానికి ఆసుపత్రికివచ్చి నూ వనినెని అడిగింపట- "మీ మరిచి కనపడటంలేదేమి" అని. అందువల్ల ఒక సారి చూసిరాకపోతే బాగుండదని బయలుదేరా. నేను రావటం చూసింది గాబోలు అప్పుడే మేడ మెట్లు దిగుతోంది. నేనూ వరండాలో వున్న బెంచిమీద కూర్చునేటప్పటికల్లా ఆమె తన నూటయాత్రైమూను పొన్లో ఎదురుగా వున్న కుర్చీలో చేరవేసి—

'ఏమండీ, అసలు కనపడటం మానేశారు?' అన్నది.

'పరీక్షలు కదండీ, తిరగటం మానేశాను.'

'ఏం. మొన్న మార్చిలో అయిపోలేదూ?'

'కొత్తగా- అడుగుతున్నారే-నా కేలెండర్లో మార్చి తరవాత సెప్టెంబరేగా'

ఆమె నవ్వటం, నేను ఉలిక్కిపడటం ఒక్క సారి జరిగినై.

'బలేవారండీ మీరు'

'ఏం, అట్లా అంటున్నారేం?'

'ఏంలేదు. మీ మనసులో ఏమేమి ఉద్దేశ్యాలుంటయో తెలుసుకోవాలని అప్పుడప్పుడు అనిపిస్తూంటుంది'

'నా మనసులో అసలు ఉద్దేశాలే వుండవ్. ఏమున్నా వున్నా అందరికీ తెలిసేటట్టు వుంటై.'

'—సరే దానికేం గాని, పరమేశ్వరి ఊరికి వెళ్ళిన సంగతి మీకు తెలుసా?'

'పరమేశ్వరి నాకు తెలీకుండా ఏపనీ చెయ్యలేదు. ఆమె చేసే ప్రతిపనీ, నేనెక్కడ వున్నా సరే, నాకళ్ళకు కట్టినట్టు కనపడుతుంది—మీరు నవ్వక్కర్లేదు—సీరియస్‌గానే చెప్తున్నా.'

'అయితే మీకు దివ్యదృష్టి వుందన్నమాట—లేకపోతేమేదన్నా శక్తినన్నా, దెయ్యాన్నన్నా వుపాసిస్తున్నారా?'

'దెయ్యాన్నీ ఉపాసించటంలేదు. దేవతనీ వుపాసించటంలేదు. నా మనస్సే పరమేశ్వరిని గురించిన అన్నివిషయాలూ ఎప్పటికప్పుడు చెప్తూ వుంటుంది. నా మనస్సుకి ఆశక్తి వుందని మీరు వొప్పుకు తీరాలి.'

'కంటికి కనపడని లేదా పరిశోధనద్వారా ధ్రువపడని శక్తుల్ని మీరు నా గనిముందు నిరా

కొండేపూడి సూర్యకామరాజు

హారదీక్ష పూని చేయటానికి సిద్ధమైనా నేను నమ్మను.'

'మీరు నిరాహారదీక్షకు బదులు ఆహార దీక్ష పూని మీ భుజబలం యింతకు రెట్టింపు పెంచి నన్ను నలిపిచంపుతానన్నా నేనూ నమ్మను, ఆ శక్తుల్ని. కాని కొన్ని కొన్ని సందర్భాలలో మనస్సుకి వుండే విచిత్రశక్తిని మనస్ఫూర్తిగా నమ్ముతాను. నా నమ్మకం సరియైనదని నిరూపించటానికన్నివిధాలా ప్రయత్నిస్తా కూడా.'

'మీరు కనక అట్లా నిరూపించకలిగితే నా మొత్తంతూకంలో పాతిక పౌన్లు ఓడిపోతాను. లేకపోతే మీ బైనాక్యులర్స్ నాకిస్తారా?'

'కేవలం వాదనకే వాదించకుండా వుంటానని హామీయిస్తే అట్లాగే'

'ఓ—హామీయిస్తా, అయినా బాగా ఆలోచించండి. మీ విలువైన వస్తు వెందుకు పోగొట్టుకుంటారు' అని, నాకు ఆలోచించుకోటానికి అవకాశమిచ్చినట్టుగా ఆమె గదిలోకి వెళ్లిపోయింది.

కదంబకు వాదించటమంటే ఒక హాబీ- మనం ఎంత తక్కువగా మాట్లాడినాసరే, తన వుద్దేశంతో ఏకీభవించినా సరే మన్ని తమాషాగా వాదనలోకి దింపుతుంది, గంటలకొద్దీ వాదించగల నైపుణ్యం, దేహదార్ఢ్యం ఆమెకు వున్నాయి. అతి గారాబంగా పెంచుకున్న తన శరీరంలోంచి పాతిక పౌన్లు యివ్వటానికి సిద్ధపడిన ఆమెతో వాదించటం జో లూయిస్‌తో నేను బాక్సింగ్ చెయ్యటం లాంటిదే! అయినా నేను భయపడలేదు. నా వాదనను బలపరిచే ఎన్నో సంఘటనల్ని నెమరువేస్తూ కూర్చున్నాను.

ఒక చేతులో గాజు కప్పూ, రెండో చేతులో పెద్ద సైజు ఫ్లాస్కూ పట్టుకుని కదం తొక్కుతూ వస్తూన్న కదంబను చూసేటప్పటికి నిజంగా జో లూయిస్‌ను చూసినట్టే వుంది. పైకి పోయే ధైర్యాన్ని కిందకులాగి కిందకుపడిన క్రాపు పైకితోసి తర్కయుద్ధానికి సిద్ధపడ్డాను.

'ఇదుగో, దీంతో కొంచెం గొంతు తడపండి తర్వాత యుద్ధానికి దిగుదాం' గాజు కప్పు నా ముందుపెట్టి అన్నది కదంబ.

'ఏమిటిది?-కాఫీయా, టీయా?'

'ఇప్పటివరకూ నేను నా చేతుల్తో కాఫీ ఎవరికీ యివ్వలేదు. ఇప్పుడు యివ్వను, ఇక ముందు యివ్వబోను. దీన్ని ప్రజలందరూ టీ అని వేనోళ్ళపొగుడుతారు.'

'క్షమించండి. నేను టీ తాగనన్న విషయం మీకు కొత్త కాదు. తాగను మొర్రో అన్న వాళ్ళకు బలవంతంగా గొంతుకలో ఎందుకు పోస్తారో నాకు అర్థంకాకుండా వుంది.'

'టీ తాగరు కాబట్టే అట్లా ఎండు నక్కలా వున్నారు. ఒక్క నెలరోజులపాటు టీ పుచ్చుకు చూడండి. మీరూ నాలాగ బలంగా తయారు కాకపోతే నన్ను కదంబ అని పిలవొద్దు.'

'నాకు వున్న బలం చాలు. మీ అంత బలం వస్తే భరించలేనేమో కూడాను.'

'మీ అమాయికత్వానికి నాకు చాలా విచారంగా వుంది-మళ్లీ ఎంతో ప్రపంచానుభవం వుందంటారు. ఎన్సైక్లోపీడియా బ్రిటానికా అంతా బట్టీ పెట్టానంటారు—టీ విలువ తెలుసుకోలేకపోయారు, ఇక మాటలు మాని పుచ్చుకోండి, చల్లారిపోతుంది.'

'టీ తాగుతే తెల్లవార్లూ మేలుకోవలసి వస్తుంది.'

'మేలుకుంటే మేలుకుంటారు-దీని సుగుణాల్ని గురించి మాట్లాడరేం? - హుషారు పుట్టిస్తుంది. జలుబు తగ్గిస్తుంది...యింకా... బ్రోంకైటిస్‌కి బలేగా పనిచేస్తుంది. టీ తాగి మొన్న నాకళ్ల ముందు ఇరవై ముగ్గురు పరీక్ష పాసయ్యారు. ఇప్పటివరకూ మూడువేల ఆరువందల తొంభై ముగ్గురు టీ. వ్యతిరేకుల్ని టీ దాసులుగా మార్చేశాను.'

ఆమె టీ గురించి ఉపన్యసించటం యిప్పుడు కొత్త కాదు. ఎవళ్లతో ఏ విషయంగూర్చి మాట్లాడినా కనీసం పావు గంటయినా టీకి ప్రత్యేకిస్తుంది. కుసుమనాథంచేత టీ తాగిద్దామని యిదివరకు అనేకసార్లు ప్రయత్నించింది. కాని కుసుమనాథం టీ తాగలేదు సరికదా టీ కప్పు బద్దలు కొట్టటమో, కదంబ తాలూకు రెడ్ లేబిల్ టీ పొట్లాలు కనకం గదిలోకి విసరటమో చేసేది. ఈ సంగతి జ్ఞాపకంవచ్చి అన్నా-

'కుసుమనాథంచేత తాగించ కలిగారా టీ?'

'ఆమె ఒక్కత్తే నాకు లొంగనిది. పాలుతప్ప యేమీ తాగదుట-నేనుగనక మినిస్ట్రీలో దూర

కలిగితేనా - పాలకు ప్రొహిబిషన్ పెట్టి టీ ఎక్స్పాన్షన్ బోర్డుని యింకా ఎక్స్పాండ్ చేసి పారేద్దును!'

అంత లెంగ్త్ అండ్ బ్రెడ్త్ వున్న ఆమె యిరుకైన మద్రాసు మినిస్ట్రీలో దూరగలగటం ఎట్లా సాధ్య మవుతుందా అని ఆలోచిస్తున్న నాకు పెదవులు చుట్రుమన్నై, గుండె జల్లుమంది. నా దృష్టి నానోటివద్ద వుంచబడ్డ కప్పుదగ్గర బయలుదేరి ఆకప్పుకు ఆధారమైన వేళ్లని దాటి ముంజేతి గుండా మోచెయ్యదాటి బలిష్ఠమైన భుజంమీద ఒక్క-క్షణం ఆగి ఆ భుజానికి యజమాని అయిన కదంబ ముఖంలో వున్న కళ్లలోకి పోయి వాక్యూమ్ బ్రేకు వేసినట్టు రపీమని ఆగిపోయింది. కదంబ కళ్లలోంచి వస్తున్న నిశితకిరణ పరంపర నాతో 'నువ్వొకనక మర్యాదగా యీ టీ తాగక పోతే, మారం పెట్టే కుర్రవాడికి దవడలు దగ్గరగా నొక్కి పళ్లమధ్య స్పూన్ పెట్టి నోట్లో ఆముదం ఎట్లా పోస్తారో అట్లాగే యీ టీ నీ గొంతులో పొయ్యవలసి వస్తుంది' అంటున్నట్టుగా వుంది. అసలే నొక్కుకుపోయిన దవడల్ని యింకా నొక్కించుకోవటం యిష్టంలేక ఆ ఆముదాన్ని- పళ్లమధ్య స్పూన్ లేకుండానే - మర్యాదగా గుటుక్కున మింగేశాను.

'—ఇక వర్ణించండి, మీ మనస్సుకున్న విచిత్ర శక్తిని' అని కుర్చీలో కూలబడ్డది.

'మెయిల్లో మద్రాసునుంచి వస్తూ అకారణంగా బాపట్లలో నేను దిగిపోవటానికి గల కారణం మీరు చెప్పగలరా ?' నా ముఖాన్ని సాధ్యమైనంత సీరియస్‌గా పెట్టి సూటిగా వేశాను ప్రశ్న.

'మీకు కొంచెం స్క్రూ లూజయి వుండాలి. అంతకన్న నాకు వేరే కారణం కనబడటం లేదు- అయినా మీ మానసికశక్తికీ, యిప్పుడు మీరు వేసిన ప్రశ్నకీ యేమీ సంబంధం లేదు.'

'లేదని మీరనగానే సరా ?- మనస్సనేది కంటికి కనపడే పదార్థమే అయివుంటే యీ పాటికి పరమేశ్వరి మనస్సనే పొట్లని శోధన నాళికలోకి తీసుకుని. నా మనస్సనే యాసిడ్ పోసి ఏ కాంపౌండో మీ కళ్ళకు కనపర్చగలిగే వాడిని. ఈ విధంగా కంటికి కనపడని వస్తువుల యొక్క విచిత్ర శక్తులు ఊహించనయినా వూహించుకోవాలి లేదా అనుభవించనయినా అనుభవించాలి. అంతేకాని కళ్ళముందు చూపమనటం కేవలం వెర్రితనం.'

'అయితే యింతకూ మీ రనేదేమిటి ?'

'ఏమంటాను ?- నా ప్రశ్నలకు సరైన సమాధానా లిమ్మంటాను- నాకు కలిగిన విచిత్రానుభవాలకు మూలకారణం వూహించటానికి ప్రయత్నించమంటాను- ఇప్పుడు చెప్పండి, పరమేశ్వరి బాపట్లలో వున్న సంగతి నాకెట్లా తెలిసిందో.'

'కుసుమనాథం చెప్పిందేమో ?'

'చాలా బాగుంది- ఎక్కడో హైదరాబాద్ సంస్థానంలో వున్న ఆమె గంటకు నలభై మైళ్ళ చొప్పున మద్రాస్ మెయిల్లో పోతున్న నాతో చెప్పిందా ?'

'అయితే ఎట్లా తెలిసిం దంటారు ?''

'అదుగో, అక్కడే మనస్సు యొక్క అద్భుతశక్తి మనకి గోచరిస్తుంది. ఆ శక్తే నన్ను బాపట్లలో రైల్లోంచి బయటకు లాగి పరమేశ్వరి దగ్గరకు లాక్కుపోయింది- లేకపోతే కల్లో అయినా అనుకున్నానా ఆమె బాపట్లలో వుంటుందని !'

'ఆ శక్తే యిప్పుడు మిమ్మల్ని పిచ్చాసుపత్రికి లాక్కుపోయేటట్టుంది '

'అదే శక్తి, అగమ్యగోచరంగా రోడ్డు వెంబడి నడిచిపోతున్న నన్ను హాల్ట్, లెఫ్టు టర్న్ అని వతన్‌లోకి యీడ్చుకుపోయింది. లేకపోతే నాకేం తెలుసూ, పరమేశ్వరి వతన్‌లో నాన్ వెజిటేరియన్ డిషెస్ నంచుకొంటున్నదనీ ?- ఆ శక్తే నాచేత రెండు ఆమ్లెట్లు తినిపించి పరమేశ్వరి చేత బిల్లు చెల్లింపించింది- నవ్వండి, నవ్వండి. మీరు నవ్వినంత మాత్రాన నా దివ్య మానసిక శక్తి దమ్మిడీ అంతకూడా తరగదు.'

'అయితే మీరు ఆమ్లెట్లుకూడా తింటున్నా రన్నమాట'

'నేను తినట మేమిటి?-ఆశక్తి...ఆ అద్భుత శక్తి...అదే నాచేత తినిపించింది.'

'ఉండండి చిన్నసందేహం, మీచేత యీ పన్లన్నీ చేయించింది ఒకవేళ ఆ పరమేశ్వరి శక్తేనేమో!

'కేవలం ఆమె శక్తి కాకపోయినా ఆమె మానసిక శక్తి కొంతవరకూ పనిచేసి వుండొచ్చు.

రెండు మనస్సుల యొక్క శక్తులూ కలసి పని చెయ్యటంవల్ల ఇంతకన్న ఎక్కువ అద్భుతాలు జరుగుతై-ఊఁ, నవ్వండి నవ్వండి."

'అయిందా?-ఇంకా ఏమన్నా వుందా?'

'అంతమంది చుట్టాలూ వుండగా ప్రత్యేకించి ఆ యింటికే ఎందుకు వెళ్లాలి నేను?-వెళ్ళానే అనుకోండి. ఒక మూలకూచోక మేడ ఎందుకు ఎక్కాలి?-ఎక్కానే అనుకోండి. నల్లటి రూపాయిల జార్జెట్ చీరె నూరురూపాయిలకు అమ్మే సామాలవాడి షాపువైపే ఎందుకు చూడాలి?-చూశానే అనుకోండి. పరమేశ్వరి ఆ షాపులోనే ఎందుకు కనపడాలి?'

'అది వుత్త కోయిన్సిడెన్స్ కావచ్చు.'

'ఒకటీ రెండూ అయితే కోయిన్సిడెన్స్ అవొచ్చు. ఇటువంటివి రోజూ ఎన్నో జరుగుతుంటే అవన్నీ కాకతాళీయమని ఎట్లా చెప్తాం?-ఇప్పుడు చూడండి- సముద్రంలో కనపడుతోంది చూశారూ, ఓడ. ఆ ఓడలోకి నేను వెళ్ళినట్టయితే అక్కడ కనపడుతుంది.'

'ఏమిటి, శక్తా?'

'కాదు. పరమేశ్వరి.'

ఇప్పటి వరకూ నా నోటినుండి వెలువడిన మాటలు యింత కంటె ఒడ్డూ పొడుగూ వున్న వాళ్ళనయినా ఒప్పించి తీరవలసిందే. కాని కదంబంలో కన్విన్స్ అయిన లక్షణాలు అణుమాత్రం కూడా నాకు కనపట్టం లేదు. పైగా హేళనగా నవ్వుతోంది.

'వాగి వాగి సగమయారు. ఈ కాస్తా పుచ్చుకోండి. మరి కొంతసేపు వాగొచ్చు.' ఆమె అందించిన టీని అంగుట్లో పోసుకున్నా.

'అయితే యీ విచిత్ర మానసిక శక్తి మీ ఒక్కరికే ప్రత్యేకంగా వుందా లేక అందరికీ సహజంగా వుంటుందా?'

'సహజంగా అందరి మనస్సులలోనూ యీ శక్తి దాగి వుంటుంది.'

'అయితే ఏ శక్తీ నన్ను కలకత్తానించి కాశీ లాక్కుపోలేదేం?- ఏ ఆమ్లెట్లూ నోట్లో కూరలేదేం?'

'ఇప్పటి వరకూ మీ మనస్సుని, బయటనించి వచ్చిన యింకొక శక్తి ఏదయినా పూర్తిగా ఆక్రమించుకొన్నదా?'

'అంటే నా కర్థం కాలేదు.'

'అంటే యింకొక రెవరయినా మీ మనమనస్సుని ఆక్రమించుకొన్నారా?'

'అంత దురదృష్టం నాకు పట్టలేదు.'

'అందుకే మానసికశక్తి విజృంభించ లేదు. మీ మనస్సులో అణగివున్న శక్తిని బయటనించి యింకో శక్తి మీ మనస్సులో ప్రవేశించి రెచ్చగొట్టాలి. అప్పుడు మీ మనస్సు మిమ్మల్ని కలకత్తానించి కాశీ కాదు కదా కాలిఫోర్నియా దాకా కూడా లాక్కుపోతుంది. ఆమ్లెట్లకు బదులు అర్థశేరు మాంసాన్ని కూడా అమాంతం తినిపించేస్తుంది.'

'మీరు చెప్పింది నాకేమీ అర్థం కావటం లేదు.'

'విచిత్ర మానసిక శక్తి నేను చెప్పిన ప్రతి అక్షరంలోనూ నృత్యం చేస్తుంటే యింకా అర్థం కాకపోవట మేమిటి?'

'ఇంతకీ పరమేశ్వరి వూరికి వెడుతోన్నట్టు తనే చెప్పిందా, మీ మనస్సు చెప్పిందా?'

'తను చెప్పుంది?—తెలీకుండా వుడాయించేద్దా మనుకుంది. నాకు మనస్సనే అద్భుతమైన పదార్థం వుండబట్టి పరమేశ్వరి ప్రయాణమంతా నా కళ్ళముందే జరిగింది.'

'ఏదీ, అది కూడా కొంచెం వర్ణించండి.'

'సముద్రపు కెరటాలు ఎత్తుగా లేచి విరగ పడుతున్నై. గాలి విపరీతంగా వుంది. వర్షం జోరుగా పడుతోంది - ఉరుములు ... మెరుపులు... పిడుగులు ... ఒకటేమిటి? - ప్రకృతి గర్భంలో పెద్ద అగ్ని పర్వతం పేలి, ఆ భీభత్సానికి తాళలేక ప్రకృతి ప్రళయ తాండవం చేస్తున్నట్టుగా వుంది—'

'ఇదంతా పరమేశ్వరి ప్రయాణాన్ని గురించేనా?'

'ఈ భీభత్సానికంతకూ కారణం ఏమిటా అని ఆలోచిస్తున్న నాకు హఠాత్తుగా గుండెల్లో ఎవరో తన్నినట్టయింది. లేచి నిలబడ్డా. చలనం కలిగిన నా మానసికశక్తి నన్ను స్టేషన్ వైపు విసిరేసింది. స్టేషన్లో పరమేశ్వరి కనపడటంతో పిడుగులు, మెరుపులు, వర్షం... అన్నీ ఆగినై. ప్రకృతి శాంతించింది - అంటే నామనస్సు నా సోమరిపోతు శరీరాన్ని స్టేషనుకి లాక్కుపోవ

టానికి ప్రయోగించిన శక్తి ప్రకృతినే ఉగ్రూత లూగించింది అన్నమాట. ఇప్పుడు ఆలోచించండి- నే నెందుకు వెళ్లాలీ, ఆవర్షంలో స్టేషనుకి?- సరే వెళ్లానే అనుకోండి. అయిదూ యిరవైకి బయలుదేరవలసిన రైలు, నేను వెళ్లేదాకా, వెళ్లాక యింకా గంటన్నరదాకా ఎందుకు ఆగి పోవాలీ ప్లాట్‌ఫారంమీద? - ఆగకేం చేస్తుంది? మూడు యింజన్లు తగిల్చినా ఆగితీరవలసిందే! - అంటే మా యిద్దరి మనస్సులకూ వున్న అద్భుత శక్తులు రెండూ కలిసి సిగ్నల్ కిందకు దిగకుండానూ, పచ్చ జెండావున్న గార్డు చెయ్యి పైకి లేవకుండానూ, యింజను పనిచెయ్యకుండానూ చేశాయన్నమాట - ఒప్పుకుంటారా యిప్పటికైనా?'

'మీ ముఖం చూస్తే భయమేస్తోంది. ముందు టీ తాగండి, తరవాత చెప్తా.'

కప్పు ఖాళీచేసి అన్నా—

'మీరు ఓడిపోయే పందేలుపెట్టి వ్యగ్రపుచ్చే కాలంలో వెయ్యోవంతు బీచిలో పరుగెత్తటానికి వుపయోగిస్తే మీఅంత అందమయిన వాళ్లు యీ పట్టణం మొత్తంలోనే కనబడకుండా పోయేవారు.' ఆమె అందాన్ని పొగడుతూనే ఆమె వోడిపోయిందన్న విషయాన్ని తెలియపర్చా.

'నా ఓటమికాని మీ గెలుపుకాని ప్రస్తుతం నేను వొప్పుకోను. మీరు చెప్పినట్టు నా మనస్సులో యితర శక్తి ప్రవేశించి నా మనస్సులో దాగివున్న శక్తిని రెచ్చగొట్టి మీకు కలిగిన విచిత్రానుభవాలలో ఏకొన్ని అయినా నాకు కలిగిస్తే అప్పుడు వొప్పుకుంటాను. - అందాకా మన పందేన్ని వాయిదా వేద్దాం.'

'అయితే యీలోగా నేను పెట్టబోయే ఒక షరతుకు మీరు వొప్పుకుంటే వాయిదాకి నా కేవిధమైన అభ్యంతరమూ లేదు.'

'ఏమిటా షరతు?'

'సముద్రపు టొడ్డునవున్న యిసకలో రోజూ మీరొక మైలు పరుగెత్తాలి మీరట్లా చెయ్యడం వల్ల యింకొక శక్తి మీలో ప్రవేశించటం సుళువుకావచ్చుకూడా.'

'మీ షరతుకి వొప్పుకుంటూ మీకొక షరతు పెడుతున్నా - ఈ రోజుమొదలు పందెం తేలేదాకా మీరుకాఫీ విసర్జించి రోజూ రెండు పూటలా టీ తాగుతూవుండాలి.'

'అంటే యిరవైనాలుగు గంటల్లో ఏ ఒక్క గంటాకూడా నిద్రపోకూడదన్నమాట!'

ఈ షరతులమీద మా పందెపు ఫలితాన్ని నిర్ణయించే వేదీ కదంబలో యింకో శక్తి ప్రవేశించేదాకా వాయిదా పడ్డది.

నా కేలండర్ కాగితాల్లో మూడు మార్చిలూ, మూడు సెప్టెంబర్లూ చింపాక, అంటే పరమేశ్వరి కాస్మెటిక్స్‌కి మరొక మూడువేలు ఖర్చయాక, అంటే మద్రాసు మినిస్ట్రీలో తొమ్మిదిసార్లు మార్పులు జరిగాక కదంబ పెళ్లికి కలకత్తా వెళ్లాను. పెళ్లి సద్దు అణిగాక పానీయపు పాత్రలు పేర్చబడ్డ గుండ్రటి బల్లచుట్టూ వున్న కుర్చీల్లో గుండ్రంగా నలుగురం కూర్చున్నాం.

'ఇంతకీ మిమల్ని కలకత్తా యీడ్చుకువచ్చిన శక్తి గోల్డెన్ లెటర్సులో ముద్రించిన నా యిన్విటేషన్ శక్తా లేక పరమేశ్వరి ప్రేరేపణ శక్తా?' టీ పెదవుల్ని చప్పరిస్తూ పెండ్లికూతురు కదంబ అన్నది.

'ఏ శక్తయితే నన్ను బాపట్లలో రైల్లోంచి బయటకు లాగిందో, ఏ శక్తయితే ఇంత విశాల ప్రపంచంలో ఒకే ఒక వ్యక్తిని నాకళ్లముందు కనపరస్తూ వుంటుందో - ఆదేశక్తి నన్నిక్కడికి తీసుకువచ్చింది!'

'ఈ శక్తినిగురించి నీ అభిప్రాయ మేమిటి పరమేశ్వరీ' కుసుమనాథం అడిగింది.

'ఇటువంటి శక్తి ప్రపంచంలోవున్న మాట నిజమే- ఆశక్తిని సాధారణంగా ఉన్మాద శక్తి అని పిలుస్తుంటారు' నావైపు ఓరగా చూస్తూ పరమేశ్వరి నవ్వింది. తక్కిన యిద్దరు అమ్మాయిలూ కూడా నవ్వారు. నేను నవ్వకపోయినా పరమేశ్వరి నవ్వు ముఖాన్ని తనివితీరా చూసి ఆనందించాను.

'మీరు పందెం ఓడినట్టు యిప్పటికైనా ఒప్పుకుంటారా ?'

'ఓడిపోకపోతే యింత సన్నంగా ఎందుకుంటాను ?- మానసిక శక్తిని గురించి మీరు చెప్పినవన్నీ నిజమని నాకిప్పుడు తెలుస్తోంది.

ఎక్కడనించో వచ్చి హాల్లో ప్రవేశించిన యితర శక్తి కొద్దిరోజుల్లో నన్ను కలకత్తానించి మరొక చోటుకి లాక్కు పోబోతున్నది కూడా.'

కదంబలో కొత్తగా ప్రవేశించిన శక్తి ఆమెను గంగానది మీద బోటులో తిప్పింది!

సూటుకేసూ, హోల్డాలూ కట్టుకుని హౌరాకు పోయే నన్ను పరమేశ్వరి కనుచూపులో వున్న విచిత్ర శక్తి మెట్రోకు తీసుకుపోయింది!

దండం విమానాశ్రయంలో వున్న డకోటా యొక్క యంత్రశక్తి నలభైముగ్గుర్ని అమాంతం ఆకాశంలోకి లాక్కుపోయింది!

కుసుమనాథం మాత్రం, తనచేత టీ తాగించటానికి ఏకమైన మా ముగ్గురి (పరమేశ్వరీ, నేనూ, కదంబా) శారీరక మానసిక శక్తుల్నీ జయించి కొబ్బరిచెట్టు కింద కూర్చుని కొబ్బరికాయ నీళ్ళు తాగుతున్నది. ఇన్ని అద్భుత శక్తులకూ అతీతమైన కుసుమనాథం కాళీఘాట్‌లో వున్న కాళీ మహాశక్తేమో——

ఇద్దరు కలిస్తే

# ఇవీ, అవీ, అన్నీ —

పిచ్చి తుగ్లక్ కాలంలో తోలు నాణేలు ఉండేవన్నారు విన్నాం. ఇప్పుడు రూపాయికి కొంత అగౌరవం జరిగిందని బాధపడే వెర్రి వాళ్ళనిగురించీ వింటున్నాం. పాతిక పాళ్లు తగ్గిందని, ఏభైదాకా వెళ్ళిందని, యింకా ఎన్నో అర్థం తెలియని అపోహలతో అమాయకుల హృదయాలు అట్టుడికిపోతున్నాయి. పోస్టాఫీసులు, బ్యాంకులు మూడురోజులు ఎందుకు కట్టేశారూ?

"వందకి ఒకటే సున్న ఉంటుందన్న మాట! ఇది అంతా లోక-ముక్కు ఫలితంగావును!"

"అది కాదండీ. క్రిప్సు చేసిన రభస—"

"ఆ క్రిప్సే-వెనక ఏదో క్రిప్సు రాయబారం అంటూ ఉండేవారు"

"అవును. శ్రీకృష్ణ రాయబారం తర్వాత విన్న రాయబారాల్లో అదొకటి."

"ఎంత చెప్పినా శ్రీకృష్ణ రాయబారం చూడవలసిన నాటకం లెండి. చాలా అద్భుతం-నాటకాల ప్రతిభ క్రమంగా క్షీణించిపోయింది."

"నిజం——డి. వి. సుబ్బారావు హరిశ్చంద్రుడే వెయ్యాలి."

"ఆరామనాథశాస్త్రి పద్యం చదవడమే-"

"స్థానం నిజంగా సత్యభామ వేషం——"

"అవును-దొమ్మేటిని 'రంగూన్ రౌడీ'లో-"

"లేకపోతే సినిమాల్లో ఏముంది అసలు-"

"అట్లా అంటే ఒప్పుకోవడం కష్టమే కాని-"

"ఇంతకీ సినిమాల్లో మగవాళ్లు ఆడవేషాలు ఎందుకు వెయ్యకూడదూ?"

"కాస్త ఆలోచించ తగ్గ విషయమే మరి-"

"ఏం సినీమాలు-చూస్తే నాటకం చూడాలి. మూడుగంటల్లో ఎలా రక్తి కడుతుంది-"

"నాటకంలో మనుష్యులు కాదు మరీ-సినీమాలో బొమ్మలేగా. పైగా వన్స్‌మోర్ అనడం ఎలాగ? 'ఏ బందా' లాంటి నటుడో స్టేజిమీద ఉంటే 'గుత్తి వంకాయ కూర'ని పాడ నివ్వకుండా ఎలా వెళ్ళనిస్తాం?"

"సినీమాలని అల్లా అని పారేస్తే ఎలాగ పాపం-ఎంత వ్యాప్తిలో ఉన్నాయి! నిమిషానికి ఒకటి చొప్పున చూస్తే మాత్రం తరుగుతాయా?"

"అవును, రామాయణ భారతాలు యిదివరకే పూర్తి అయాయి. ఎలాగో ఓర్చుకున్నాం-కా శీ మ జి లీ ల ఋ తు వు కూ డా వెళ్ళిపోతోం దనుకుంటాను. ఇంక ఇంగ్లీషు సాహిత్యంమీద పడి ఒక్కొక్కణ్ణీ చిత్రవధ చేస్తోంటే బాధ ఎలాగ భరించడం?"

"అబ్బే! సినీమాల్లో ఇంకా ఎన్ని చూపిస్తారు!- వూళ్ళో వున్నవన్నీను: 'హైక్లాసు హెయిర్ కటింగ్ సెలూన్'- శతమూలికాది లేహ్యం- 'టీకాలు వేయించుకోండి'- అన్నట్టు 'డోంగ్రే' వారి బాలామృతం".

"ఇంకా, రాబోవు చిత్రాలయ్యా- న్యూ పేరోడ్- కేశవనామాల్లా మన నాయకులు వరసగా కనిపిస్తే హాల్లో చేతులు బాదుకోవడం- వెంటనే సోడా, సోడా అనే అరుపులు- నేల మీద కూర్చున్నవాళ్లలో తేలు, తేలంటూ అల్లరి-